

ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో హిందీకి పట్టం

స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల ఆగ్రహం



చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందీ భాషను నిర్బంధంగా అమలు చేసేలా జీవిత బీమా సంస్థ వెబ్‌సైట్‌ను హిందీ భాషలోకి మార్చడం పట్ల డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు చేశారు.



కేంద్ర ప్రభుత్వం హిందీ తెలియని రాష్ట్రాల్లో ఆ భాషను నిర్బంధంగా అమలుపరిచేలా హిందీ భాషకే ప్రాధాన్యం కల్పించడం గర్హనీయమని స్టాలిన్ పేర్కొన్నారు. ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో నెటిజన్లు ఆంగ్ల భాష ఎంపిక చేసుకోవడానికి కూడా హిందీలోనే వెతుక్కునే దుస్థితి పట్టించారని ఆయన మండిపడ్డారు.



ఇవన్నీ బహుభాషా సమ్మేళనంగా ఉన్న భారతదేశంలో ప్రత్యేకించి ఓ భాషను బలవంతంగా అమలు చేయడమేనని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవిత బీమా సంస్థ నిర్వాహకులు తక్షణమే ఆ వెబ్‌సైట్‌లో హిందీ భాషను తొలగించి ఎప్పటివలె ఆంగ్లంలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్టాలిన్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉండగా జీవిత బీమా సంస్థ వెబ్‌సైట్‌లో ఉన్నట్టుండి హిందీ ప్రత్యక్షం కావడం దిగ్భ్రాంతి కలిగించిందని మాజీ సీఎం ఈపీఎస్ అన్నారు. అదే విధంగా ఎండీఎంకే నేత వైగో సహా డీఎంకే మిత్రపక్షాలైన డీపీఐ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా జీవిత బీమా వెబ్‌సైట్‌ను హిందీలోకి మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రకటనలు వెలువరించారు.



మావటి ఉదయకుమార్, శిశుపాలన్ (ఫైల్‌ఫోటోలు)



ఏనుగును సంకెళ్లతో బంధించి ఉంచిన గది

సెల్ఫీలతో చిరాకు వల్లే..

ఆలయ ఏనుగు దాడి?

- అటవీశాఖ అధికారుల అంచనా
- మావటిని చంపిన కరి కంటనీరు
- చలించిపోయిన నెటిజన్లు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు ఆలయ ఏనుగు దైవానై మావటి, అతడి బంధువుపై దాడికి కారణం సెల్ఫీలతో దానికి ఇబ్బంది కలిగించడమేనని తెలుస్తోంది. తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఏనుగు దైవానై (26)ను సంరక్షించడానికి అదే ప్రాంతానికి చెందిన ఉదయకుమార్ (46), రాధాకృష్ణన్ (57), సెంథిల్‌కుమార్ (47) అనే ముగ్గురు మావటీలుగా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆ ఏనుగు వద్ద మావటి ఉదయకుమార్ మాత్రమే ఉన్నారు. ఆ సమయంలో ఉదయకుమార్‌ను చూడటానికి అతడి బంధువు కన్నియాకుమారి జిల్లా బలుకల్ ప్రాంతానికి చెందిన శిశుపాలన్ (59) వెళ్లారు. ఉదయకుమార్‌తో మాట్లాడుతూ శిశుపాలన్ ఆ ఏనుగు తొండాన్ని ముద్దుపెట్టుకుంటూ సెల్ఫీ తీశాడు. దీంతో ఆగ్రహించిన ఆ ఏనుగు అతడిని తొండంతో చుట్టి పైకెత్తి పడేసింది. అది చూసి ఏనుగును అదుపు చేసేందుకు ఉదయకుమార్ ప్రయత్నించినప్పటికీ ఆ ఏనుగు అతడిని కూడా తొండంతో విసిరి కొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరూ మరణించారు. ఏనుగు దాడిలో మృతి చెందిన మాజీ సైనికుడు శిశుపాలన్ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. ఆయన తండ్రి తిరుచెందూరు ఆలయంలో మావటిగా సేవలందించారు. దీంతో శిశుపాలన్ చిన్నప్పటి నుండే ఆలయ ఏనుగులను చూడటానికి వచ్చేవాడు. ప్రస్తుతమున్న ఆలయ ఏనుగు దైవానై కోసం ఆలయ రాజగోపురం సమీపంలో ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల క్రితం శిశుపాలన్ ఆ ఏనుగుతో అల్లరిగా ప్రవర్తించాడని, దీంతో అది ఆయనపై తీవ్ర ఆగ్రహం పెంచుకుందని తెలుస్తోంది.

ఏనుగుకు వైద్య పరీక్షలు..

ఈ సంఘటన జరిగిన తర్వాత జిల్లా ఫారెస్టు ఆఫీసర్ రేవతి రామన్, అటవీ శాఖ వైద్యులు మనోహర్, ముత్తుకృష్ణన్ తదితరులు ఏనుగు దైవానైకి వైద్యపరీక్షలు జరిపారు. ప్రస్తుతం ఆ ఏనుగు గది వద్ద పోలీసుల కాపలా ఏర్పాటు చేశారు. ఆ ఏనుగును సంరక్షించడం కోసం ఆలయ నిర్వాహకులు తిరునల్వేలి నెల్లయప్పర్ ఆలయ మావటి రామదాస్‌ను కూడా రప్పించారు. తిరుచెందూరు ఆలయ ఏనుగు ఇప్పటివరకు ఎవరిపైనా దాడి చేయలేదు. సోమవారం శిశుపాలన్ రాకముందు ఇతర మావటీలు, వారి స్నేహితులూ ఆ ఏనుగు దగ్గరకు వెళ్ళినా అది వారికి ఎలాంటి హాని చేయలేదు. అయితే శిశుపాలన్ సెల్ఫీ తీయడానికి ప్రయత్నించడతోనే ఆ ఏనుగు విసుగు చెంది దాడికి దిగినట్లు అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం సామాజిక ప్రసార మాధ్యమాల్లో మావటి ఉదయకుమార్ ఆలయ ఏనుగు దైవానైకి స్నానపానాదులు చేస్తున్న పాత వీడియోలు, తన పాదాల చెంత పడి ఉన్న ఉదయకుమార్‌ను చూసి కన్నీరు కారుస్తున్న సీసీ పుటేజీ దృశ్యాలు ప్రసారమవుతున్నాయి. ఆ వీడియోలను చూసి నెటిజన్లు కూడా కంట తడిపెట్టుకుంటున్నారు.



ఏనుగుల శిబిరానికి మావటితో లారీలో వెళ్తున్న దైవానై (ఫైల్‌ఫోటో)

తొండాన్ని ముద్దాడి సెల్ఫీ..

శిశుపాలన్ ఆ ఏనుగు ఉన్న గదిలో ముందువైపు ప్రవేశించాడు. ఆ సమయంలో మావటి ఉదయకుమార్ ఏనుగు వెనుక నేలను శుభ్రం చేస్తున్నాడు. శిశుపాలన్ ఆ ఏనుగు దగ్గరకు వెళ్ళి తొండాన్ని ముద్దుపెట్టుకుంటూ సెల్ఫీ తీసుకున్నాడు. తరువాత ఆ ఏనుగుకు అటూ ఇటూ నిలిచి సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో చిరాకుపడ్డ ఏనుగు శిశుపాలన్‌ను తొండంతో పైకెత్తి విసిరి కాలితో తొక్కింది. అది చూసి దిగ్భ్రాంతి చెందిన ఉదయకుమార్ ఏనుగు అదుపు చేయడానికి దూసుకొచ్చాడు. తన వెనుక వస్తున్నదని మావటి అని తెలియని ఆ ఏనుగు మరొక వ్యక్తిగా భావించి తొండంతో చుట్టి విసిరేసింది. దీంతో వారిద్దరు తలలు పగలి అక్కడికక్కడే మరణించారు. అదే సమయంలో తన ముందు విగతజీవుడై పడి ఉన్న మావటిని చూసి ఆ ఏనుగు కంట తడిపెట్టుకుంది. అలా గంటకు పైగా ఆ ఏనుగు ఏడుస్తూనే ఉంది. శవంగా పడి ఉన్న మావటి ఉదయకుమార్‌ను తొండంతో పైకి లేపేందుకు పలు మార్లు ప్రయత్నించింది. చివరకు తను చేసిన తప్పుకు ఆహారం కూడా తీసుకోకుండా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 10 గంటల దాకా పస్తులతోనే గడిపింది.. చివరకు ఇతర మావటీలు తీవ్రంగా ప్రయత్నించిన మీదట కొన్ని ఆకులను తిని ఆ గదిలోనే కూర్చుని రోదించింది. ఈ దృశ్యాలన్నీ అక్కడి సీసీ కెమెరాలలో నమోదై ఉన్నాయి.

సంరక్షకుడిని కోల్పోయి.. రోదించి...

ముగ్గురు మావటీలున్నా ఉదయకుమార్‌తోనే ఆ ఏనుగు చాలా సఖ్యతగా మెలగుతుండేది. ప్రతిరోజూ ఉదయం ఆయనతోపాటు వాకింగ్‌కు వెళ్లేది. భక్తులను ఆశీర్వదించే సమయంలోనూ ఉదయకుమార్‌తో ఆ ఏనుగు ఆటలాడుతుండేది. ఆలయ సమీపంలోని ఏనుగు కోసం నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌కు కూడా ఆయనే తీసుకెళ్లేవాడు. వీటన్నికంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఏనుగుల శిబిరానికి వెళ్లేటప్పుడు ఉదయకుమార్ వెంట ఉంటేనే ఆ ఏనుగు లారీలోకి ఎక్కేది. ఇలా తనను కంటికి రెప్పలా కాపాడిన మావటి ఉదయకుమార్ చంపినందుకు రాత్రంతా ఆ ఏనుగు బాధతో నిద్రపోకుండానే గడిపింది. ఈ విషయమై తిరుచెందూరు రేంజ్ అటవీ శాఖాధికారి కవిన్ మాట్లాడుతూ మావటి బంధువు శిశుపాలన్ ఏనుగుతో సెల్ఫీ తీయడం వల్లే అది విసుగుతో అతడిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఇక వెనుక వేరే వ్యక్తి వస్తున్నాడని పొరపాటున భావించి అతడిపై కూడా ఏనుగు దాడికి దిగినట్లు చెప్పారు.



సభ్యత్వ కార్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

తెలుగు జాతి ఉన్నంత వరకు టీడీపీ ఉండాలి

విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

- సామాన్యులకు అండగా ఉంటాం : చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగు దేశం పార్టీ ఉండాలని ఆ పార్టీకి చెందిన విజయనగరం ఎంపీ, అండమాన్, తమిళనాడు సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జ్ కలిశెట్టి అప్పలనాయుడు ఆకాంక్షించారు. చెన్నై టీడీపీ విభాగం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అన్నానగర్ టవర్ క్లబ్‌లో మంగళవారం ప్రారంభించింది. ఇందులో ఎంపీ కలిశెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. చెన్నై టీడీపీ ఫోరం సభ్యులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, గత ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించారని ప్రశంసించారు. నగరంలోని ప్రజలను చైతన్యవంతుల్ని చేసి పార్టీ సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. టీడీపీలో కార్యకర్త అయిన తనను పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ గుర్తించి, విజయనగరం ఎంపీ స్థానాన్ని తనకిచ్చారన్నారు. పార్టీ మనకు ఏం ఇచ్చిందని కాకుండా, పార్టీకి మనం ఏం చేశామన్నది ముఖ్యమన్నారు. తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్ఠలు మరింతగా పెరిగేలా చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తారన్నారు.

సామాన్య ప్రజలకు అండగా ఉంటాం : చంద్రశేఖర్

చెన్నైలోని సామాన్య తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒక వారధిగా ఉంటూ సామాజిక బాధ్యతతో కృషి చేస్తామని చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. చెన్నై నగరంలో అనేక మంది తెలుగు ప్రజలు ఉన్నత స్థితిలో ఉండగా, మరికొందరికి రాజకీయ పలుబడి ఉందన్నారు. కానీ, కింది స్థాయిలో సామాన్య తెలుగు ప్రజలకు ఏదైనా సమస్య వస్తే, దాన్ని పరిష్కరించేవారు, సాయం చేసేవారు లేరన్నారు. ఇలాంటి సమయంలో తాము పార్టీపరంగా కాకుండా, ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ప్రారంభించి సాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. చెన్నై నగరంలోని ప్రతి ఒక్క తెలుగువారు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించాలని, టీడీపీ గుర్తింపు కార్డు కలిగివుండటం ఒక గౌరవంగా, హక్కుగా భావించాలన్నారు. పార్టీ మనుగడ సాగించాలంటే కేవలం కార్యకర్తలు ఉంటే సరిపోరని, ఆర్థిక వనరులు కూడా ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ పార్టీకి విరాళాలివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

అండమాన్‌లో డిసైడింగ్ ఫ్యాక్టర్ : మాధవ నాయుడు

అండమాన్‌లో టీడీపీ ఒక డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా మారిందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు అన్నారు. గతంలో అక్కడ టీడీపీ ఏ పార్టీకి మద్దతిస్తే ఆ పార్టీ అభ్యర్థి గెలిచారని గుర్తు చేశారు. అలాగే, చెన్నైలో టీడీపీని అభివృద్ధి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు రామాంజనేయులు, మన్నూరు చలపతి, టీటీడీ స్థానిక సలహా మండలి మాజీ సభ్యుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నేత కనకాల నిర్మలమ్మ తన పింఛను డబ్బుల నుంచి పార్టీ నిధికి రూ.2 లక్షలు, మన్నూరు చలపతి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు.

నెమ్మేలి నిర్లవణీకరణ కర్మాగారంలో

కేంద్ర ఆర్థిక సంఘం సభ్యులు



నిర్లవణీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్థిక సంఘం సభ్యులు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన కేంద్ర ఆర్థిక సంఘం సభ్యులు మంగళవారం ఉదయం చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలోని నెమ్మేలిలో ఉన నిర్లవణీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. 16వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ బంకారియా, కార్యదర్శి రిత్విక్‌పాండే, సభ్యులు అన్నీ జార్జ్, అజయ్ నారాయణ్‌జా, మనోజ్ పాండే, అన్ని జార్జ్ మాథ్యూ, సౌమ్యా కంటి ఘోష్ సహా 12 మంది సభ్యులు నగరానికి ఆదివారం చేరుకోగా, సోమవారం స్టార్‌హోటల్‌లో సీఎం స్టాలిన్ సహా మంత్రులు, ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆర్థిక సంఘం సభ్యులంతా నెమ్మేలి నిర్లవణీకరణ కేంద్రానికి వెళ్ళి ఆ కర్మాగారం పనితీరు తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ బంకారియా మీడియాతో మాట్లాడుతూ 9వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు తమిళనాడు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరుల నుంచి 7.931 శాతం మేర నిధులు విడుదవుతుండేవని, 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదన ప్రకారం ప్రస్తుతం 4.079 శాతం మేరకు నిధులు తగ్గించారని, దీంతో రాష్ట్రానికి రూ.3.57 కోట్ల మేరకు నష్టం వాటిల్లుతున్నదనే విషయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. త్వరలో మరిన్ని రాష్ట్రాల్లో పర్యటించిన అనంతరం తమ సిఫారసులను కేంద్ర ప్రభుత్వానికి నివేదికగా సమర్పించనున్నామని చెప్పారు. ఆర్థిక సంఘం సభ్యులతోపాటు మంచినీటి సరఫరా సంస్థ సీఈఓ కార్తికేయన్, చెంగల్పట్టు కలెక్టర్ అరుణ్‌రాజ్, ఎస్పీ సాయ్‌ప్రణీత్ తదితర అధికారులున్నారు. ఈ కర్మాగారాన్ని పరిశీలించిన తర్వాత కేంద్ర ఆర్థిక సభ్యులు అక్కడి నుంచి శ్రీపెరుంబుదూరులో ఉన్న ఎగుమతుల సంబంధిత కర్మాగారాలను సందర్శించడానికి బయలుదేరి వెళ్ళారు.

దక్షిణ జిల్లాల్లో భారీవర్షాలు

- డెల్టాలో నీటమునిగిన వరిపైరు



ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం ప్రభావంతో దక్షిణాది జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. డెల్టా జిల్లాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నీటమునగడంతో నష్టపోయిన తమను ఆదుకోవాలంటూ రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో దక్షిణ సముద్రతీర జిల్లాల్లో కొన్నిరోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కన్నియాకుమారి వద్ద సముద్రంలో అల్పపీడనం కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి, రామేశ్వరం తదితర దక్షిణ జిల్లాలు సహా డెల్టా జిల్లాల్లో కూడా వర్షాలు పడుతున్నాయి. రెండు రోజులుగా ఉరుములు, మెరుపులతో కురుస్తున్న వర్షానికి వరి పంట నీటమునిగింది. తంజావూరు జిల్లాలో 500 ఎకరాల్లో వరి పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు కంటతడి పెట్టుకున్నారు. దెబ్బతిన్న వ్యవసాయ భూములను తంజావూరు జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు. పంట నష్టంపై వివరాలు సేకరించాలని ఆమె వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వర్షానికి తిరువారూరు, నాగపట్టణం జిల్లాల్లో కూడా పంటలు నీటిపాలయ్యాయి.

23న తుఫాను...

బంగాళాఖాతంలో గత నెల 14వ తేది మొదటిసారి ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాజధాని నగరం చెన్నైలో మూడు రోజులు భారీవర్షాలు కురిశాయి. ఈ నెల 23వ తేది బంగాళాఖాతంలో తుఫాను ఏర్పడే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో మరో రెండు రోజుల్లో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది.

టీవీకేపై ఇంటెలిజెన్స్ నిఘా



చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం (టీవీకే)కు రాష్ట్రవ్యాప్తంగా ఏ మేరకు మద్దతు లభిస్తోందన్న వ్యవహారంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీస్తోంది. శాసనసభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇటీవల విక్రవాండిలో నిర్వహించిన టీవీకే తొలిమహానాడుకు ఐదు లక్షలమందికిపైగా జనసమీకరణ ఎలా సాధ్యమైందనే విషయమై ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు రాబడుతున్నారు. మహానాడుకు వచ్చినవారంతా విజయ్ సినిమా నటుడని వచ్చారా లేక పార్టీపై అభిమానంతో వచ్చారా అనే విషయం పై కూపీ లాగుతున్నారు. అదే సమయంలో మహానాడు ఏర్పాట్లకు విరాళాలిచ్చిన ప్రముఖుల వివరాలను కూడా ఇంటెలిజెన్స్ అధికారులు సేకరిస్తున్నారు. పార్టీలో కొత్తగా చేరుతున్న వారి వివరాలు, ఎన్నికల పొత్తుపై ప్రధాన పార్టీల నేతలతో జరుపుతున్న చర్చల గురించి కూడా ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించించి రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో సమర్పించనున్నారని తెలుస్తోంది.

2 వేల ఇళ్లపై ఎగిరిన టీవీకే జెండాలు...

పుదుకోట జిల్లా గంధర్వకోట సమీపంలో గత రెండు రోజులుగా రెండు వేలకు పైగా ఇళ్లపై టీవీకే జెండాలను స్థానికులు ఎగరేసారు. పార్టీ పతాక ఆవిష్కరణకు స్థానిక నాయకులు పోలీసుల అనుమతి కోరగా, పోలీసులు అనుమతివ్వలేదు. దీంతో స్థానిక నాయకులు ఇళ్లపై జెండాలను ఎగరేసారు.

సమాచార దర్శిని

22న పట్టాభిరాం టైడల్ పార్క్ ప్రారంభం

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు పెంచేందుకు చిన్న నగరాల్లో మినీ టైడల్ పార్క్‌లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. ఆ ప్రకారం ఆవడి సమీపం పట్టాభిరాంలో ఏర్పాటైన మినీ టైడల్ పార్క్‌ను ఈ నెల 22న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని సచివాలయం తెలియజేసింది.

డేనిష్ కోటను ఉచితంగా చూసే అవకాశం

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా తంగంబాడిలోని పురాతన చిహ్నం డేనిష్‌కోటను మంగళవారం నుంచి ఉచితంగా తిలకిందుకు అనుమతించారు. ప్రపంచ వారసత్వ స్వరోత్సవాల సందర్భంగా ఈ నెల 25వ తేది వరకు ఏడు రోజులు ఈ కోటను పర్యాటకులు, ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చని అధికారులు తెలిపారు.

డిసెంబరు 21 నుంచి చెన్నై-పెనాంగ్ మధ్య విమానాలు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి మలేసియా దేశంలోని ప్రత్యేక ద్వీపమైన పెనాంగ్‌కు డిసెంబరు 21 నుంచి విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. తమిళులు అధికంగా ఉన్న పెనాంగ్‌కు విమానాలు నడపాలని వివిధ సంస్థల అభ్యర్థనలను పరిశీలించిన కేంద్ర విమానయాన సంస్థ, చెన్నై-పెనాంగ్ మధ్య విమానాలు నడిపేందుకు అనుమతులు జారీచేసిందని అధికారులు తెలిపారు.

రూ.176 కోట్లతో సబ్ స్టేషన్లు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై మండలంలో వర్షాకాలంలో విద్యుత్ కోతలు అరికట్టేందుకు రూ.176 కోట్లతో 9 ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రకారం, మాధవరం రేడియన్స్, ఎంకేబీ నగర్, పరుత్తిపట్టు, సదరన్ అవెన్యూ, చోళవరం, పుదుపేట, ముండకన్ని అమ్మన్ ఆలయం, డేవిడ్‌సన్ వీధి, గణేశ్ నగర్ తదితర ప్రాంతాల్లో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. అలాగే, ఈ మండలంలో రూ.785 కోట్లతో 5,433 ఆధునిక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయగా, మరో రూ.51 కోట్లతో 310 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేపట్టినట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

అయ్యప్ప భక్తుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రాంతీయ రవాణా కార్యాలయంలో హెల్ప్ లైన్ నెంబర్లు సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి దేవి దాస్ విడుదల చేసిన ప్రకటనలో... శబరిమల వెళ్లే భక్తుల వాహనాలు మార్గమధ్యంలో మరమ్మతులకు గురికావడం, మరేదైనా ఇబ్బందులు ఏర్పడితే సహాయం చేసేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. 94000 44991, 9562318181 (ఇళవుంగల్), 949636 7974, 8547639173 (ఏరుమేలి), 9446037 100, 8547639176 (కుట్టికానం) ప్రాంతాల్లోకి కేంద్రాలను సంప్రదించవచ్చు. ఈ కేంద్రాల్లో మెకానిక్, క్రేన్, అంబులెన్స్ తదితరాలు సిద్ధంగా ఉంటాయని ఆయన తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీసీ కెమెరాలు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 4,000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది, నర్సులు పనితీరు పర్యవేక్షణ, అవాంఛనీయ సంఘటనలు అడ్డుకొనేలా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 4,000 సీసీ కెమెరాలు ఏర్పాటును ఈ నెల 29వ తేదిలోగా పూర్తి చేయాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు వైద్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

25 నుంచి రేషన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార రేషన్ దుకాణాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో 33,500 రేషన్ దుకాణాలుండగా, సేల్స్ మెన్, తూకం వేసే సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో జిల్లాల్లోని రేషన్ దుకాణాల్లో ఖాళీలు భర్తీ చేసేలా సహకార శాఖ ఆధీనంలోని జిల్లా ఉద్యోగుల ఎంపిక కేంద్రాలు ఈ నెల తొలివారంలో నోటిఫికేషన్ విడుదల చేసాయి. మొత్తం 2 వేల పోస్టులకు సుమారు లక్ష మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న జిల్లా ఉద్యోగుల ఎంపిక కేంద్రం వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ రోజున ఫొటోలు, సర్టిఫికెట్లు, సంతకంతో కూడిన నకళ్లతో హాజరుకావాలని అధికారులు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణకు 6.85 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక శిబిరాల్లో 6,85,513 దరఖాస్తులు అందాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేసిన ప్రకటనలో... ఓటరు జాబితాలో సవరణకు శని, ఆదివారాలు (ఈ నెల 16,17 తేదీలు) ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుకు 4,42,035 మంది, తొలగింపునకు 44,128, చిరునామా, నియోజకవర్గం మార్పునకు 1,98,931, ఓటరు జాబితాలో ఆధార్ నెంబరు చేర్చేందుకు 419 మంది దరఖాస్తు చేశారని ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ తెలిపారు.

నేడు ఎంకేబీ నగర్‌లో సీతారాముల కల్యాణం

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి ఎంకేబీ నగర్‌లోని వలంపురి వ్యాస వినాయగర్ ఆలయంలో బుధవారం సీతారామ కల్యాణోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ సమేత హనుమాన్ నూతన పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగనున్న దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచన, అంకురార్పణ, యాగపూజను నెల్లూరు జిల్లా పేదూరు గ్రామానికి చెందిన వేదగిరి నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు మాధవగిరి లక్ష్మీనరసింహ మూర్తి బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. మంగళవారం ఉదయం 7 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, పంచగవ్య క్షీరజలాధివాసం, హోమాలు నిర్వహించారు. బుధవారం నూతన పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, రాత్రికి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని స్వామిమలైలో రూపొందించిన నూతన పంచలోహ విగ్రహాల ఉభయదారులు మొలగనూరు విజయకుమార్-సురేఖ, మల్లాపు నారాయణ-సునీత దంపతులు కార్యక్రమం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



యాగశాల పూజలో విజయకుమార్, నారాయణ దంపతులు, పూజారులు

నేటినుంచి మూడు మండలాల్లో తాగునీటికి అంతరాయం

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం ఉత్తమర్ గాంధీ రోడ్డు, సేమియర్స్ రోడ్డులో మెట్రోరైలు పనుల కోసం ప్రధాన తాగునీటి పైప్ లైన్ మారుస్తున్నారు. ఈ కారణంగా వళ్లువర్‌కోట్టం, దక్షిణ చెన్నై, కీల్పాక్కం తాగునీటి సరఫరా కేంద్రాలు బుధ, గురువారాలు పనిచేయవు. అందువల్ల తేనాంపేట మండలంలోని కీల్పాక్కం, చూలైమేడు, నుంగంబాక్కం, చెట్‌పెట్, థౌజండ్ లైట్స్, కోడంబాక్కం, రాయపేట, గోపాలపురం, తేనాంపేట, టి.నగర్, ఆళ్వార్‌పేట, మైలాపూర్, నందనం తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. అలాగే, కోడంబాక్కం మండలంలో వడపళని, అశోక్‌నగర్, సీఐటీ నగర్, వెస్ట్ మాంబళం, అడయార్ మండలంలో సైదాపేట ప్రాంతాల్లోనూ తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. అత్యవసర తాగునీటి అవసరాలకు మెట్రోవాటర్ బోర్డు వెబ్‌సైట్, 044-45674567 అనే నెంబరు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

ట్రాలీలు, పెద్ద బ్యాగులకు బస్సులో లగేజీ ఛార్జీ

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సుల్లో ప్రయాణికులు తీసుకెళ్లే 65 సెం.మీ పైబడిన ట్రాలీ సూట్‌కేస్‌లు, 20 కిలోలకు పైగా ఉన్న లగేజీకి ఛార్జీ వసూలుచేయనున్నారు. ఈ మేరకు ఎంటీసీ విడుదల చేసిన ప్రకటనలో... ఎంటీసీ బస్సుల్లో ప్రయాణికుల లగేజీపై ఛార్జీ వసూలుచేసే విషయమై డ్రైవర్లు, కండక్టర్లు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించామన్నారు. ఆ ప్రకారం, ప్రయాణికులు తీసుకెళ్లే లగేజీకి సంబంధించి ఛార్జీలు వసూలుచేసేలా మార్గదర్శకాలు రూపొందించామని తెలిపింది. ఆ ప్రకారం, ట్రాలీ సూట్‌కేస్‌లు, 20 కిలోలకు మించి బ్యాగులకు లగేజీ ఛార్జీ వసూలుచేయనున్నామన్నారు. అదే సమయంలో మాదకద్రవ్యాలు, నిషేధిత వస్తువులు తరలింపును అడ్డుకొనేందుకు కూడా ఈ చర్యలు ఉపయోగపడతాయని ఎంటీసీ తెలిపింది.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు స్పందన

వేలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపురం శక్తి అమ్మ 30వ వార్షిక ఆధ్యాత్మిక సేవ, జన్మదినం సందర్భంగా నారాయణి పాఠశాలు, పవిత్ర చెస్ అకాడమి సంయుక్తంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. నారాయణి పాఠశాలలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీపురం స్వర్ణాలయం, నారాయణి పాఠశాల డైరెక్టర్, ట్రస్టీ డా.సురేష్‌బాబు, నారాయణి ఆస్పత్రి, రీసెర్చి కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బాలాజి, సినీ హాస్యనటుడు దాము తదితరులు పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు చేరుకున్న బైక్ ర్యాలీ

వేలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత సైనిక శాఖ మద్రాసు ఇంజనీరింగ్ విభాగం ప్రారంభమై 244 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ విభాగంపై అవగాహన కల్పించేలా జిల్లాలో విద్యుత్ ద్విచక్ర వాహనంలో లెఫ్ట్‌నెంట్ విషాల్ ధాకూర్ అధ్యక్షతన గ్రూపు నగరానికి చేరుకుంది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో వేలూరు రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, మాజీ సైనికులు పాల్గొన్నారు.



జెండా ఊపి పంపుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

అరుంబాక్కంలో వినాయక ఆలయం కూల్చివేత

● మహిళల ధర్నా

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కం జానకిరామన్ కాలనీలో 40 ఏళ్లనాటి వినాయకుడు ఆలయాన్ని కూల్చివేసేందుకు వెళ్లిన జీసీసీ అధికారులను అడ్డుకున్న మహిళలు ధర్నా నిర్వహించారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన బాల వినాయక ఆలయం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని మద్రాసు హైకోర్టులో కేసు దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం, ఆలయాన్ని కూల్చివేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌కు ఆదేశించింది. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం జీసీసీ ఇంజనీర్ పద్మనాభన్ నేతృత్వంలో కార్పొరేషన్ సిబ్బంది అక్కడకు చేరుకొని ఆలయం తొలగించేందుకు యత్నించారు. స్థానికులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఈ వ్యవహారంపై స్పందించిన అధికారులు, నెల రోజులు గడువు ఇస్తామని ప్రకటించడంతో, వారు అక్కడి నుంచి వెళ్లారు.

వరికోత యంత్రంలో చిక్కుకొని మహిళ మృతి

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి కోత యంత్రంలో చిక్కుకొని మహిళ మృతిచెందిన ఘటన తిరుపత్తూర్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. కురుంబకేరి పుదూర్ ప్రాంతానికి చెందిన నటరాజ్ భార్య శశికళ (42) పొలంలో వరి కోత పనులకు వెళ్లింది. వరి కోసే యంత్రం చక్రంలో శశికళ చీర చిక్కుకోవడంతో ఆమె తల యంత్రంలోకి వెళ్లి నుజ్జునుజ్జయి, ఘటనాస్థలంలోనే మృతిచెందింది. ఊహించని ఈ దారుణాన్ని చూసిన చుట్టుపక్కల ఉన్న వారు వెంటనే కరెంట్ సరఫరా నిలిపివేసి, ఆమెను పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై జోలార్‌పేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కల్వరాయన్ కొండ ప్రాంతానికి రోడ్డు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్వరాయన్ కొండ ప్రాంతంలో ఉన్న వెళ్లిమలై-చిన్న తిరుపతి మధ్య రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారని మద్రాసు హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కల్వరాయన్ కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పన కోసం మద్రాసు హైకోర్టు సుమోటో కేసు నమోదుచేసి విచారిస్తోంది. ఈ కేసు మంగళవారం మళ్లీ విచారణకు రాగా, కల్వరాయన్ కొండ ప్రాంతంలో 10 కి.మీ మేర రోడ్డు మరమ్మతులు చేపట్టామని, మట్టి రోడ్ల మరమ్మతులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం తరఫున హైకోర్టుకు విన్నవించారు. ఈ విషయమై ప్రమాణ పత్రం దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదావేసింది.

విజయ్ పార్టీతో పొత్తుకోసం చర్చించలేదు

● మాజీ మంత్రి డి.జయకుమార్



ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో ఇప్పటివరకు పొత్తు గురించి చర్చించలేదని, పొత్తుపై వస్తున్న వదంతులు నమ్మరాదని అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ పేర్కొన్నారు. రాయపేటలోని అన్నాడీఎంకే కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మతవాదం ప్రోత్సహించే పార్టీలతో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు కుదుర్చుకోమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇంతకు ముందే స్పష్టంగా అభిప్రాయం తెలియజేశారని, డీఎంకేను వ్యతిరేకించే పార్టీలు అన్నాడీఎంకే కూటమిలోకి రావచ్చని ఆయన ఆహ్వానించారని తెలిపారు. అయితే, కూటమికి సంబంధించి కొన్ని ప్రాంతీయ పార్టీలతో అన్నాడీఎంకే చర్చలు సాగిస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మరాదన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉందని, పొత్తుపై ఈపీఎస్ నిర్ణయం తీసుకుంటారని జయకుమార్ తెలిపారు.

ఏకనాపురం ఉప సర్పంచు ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏకనాపురం పంచాయతి ఉప సర్పంచ్ దివ్య (35) సోమవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె పరందూర్ విమానాశ్రయానికి వ్యతిరేకంగా 9 సార్లు పంచాయతి సర్పంచ్, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని బలపరచారు. చెన్నై 2వ విమానాశ్రయం కాంచీపురం సమీపం పరందూర్‌లో ఏర్పాటుకానుంది. విమానాశ్రయ ఏర్పాటుకు పరందూర్, చుట్టుపక్కల ఉన్న 13 గ్రామాల నుంచి 5,000 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, అందులో ఏకనాపురం సహా పలు గ్రామాలను పూర్తిగా స్వాధీనం చేసుకోనున్నారు. అందువల్ల ఏకనాపురం కేంద్రంగా రెండేళ్లుగా బాధిత గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపడుతున్నారు. ఆ ఆందోళనల్లో చురుగ్గా పాల్గొంటున్న గణపతి భార్య దివ్య. ఆమె పరందూర్ విమానాశ్రయానికి వ్యతిరేకంగా పంచాయతి సమావేశాల్లో 9 సార్లు తీర్మానం చేశారు. ఈ క్రమంలో, సోమవారం సాయంత్రం హఠాత్తుగా ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అనారోగ్యం కారణం, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిందని పలు రకాల కథనాలు వినిపిస్తున్నాయి. కాగా, పరందూర్ విమానాశ్రయం కోసం భూసేకరణ వేగవంతం చేసిన కారణంగా మనస్తాపం చెందిన దివ్య ఆత్మహత్యకు పాల్పడిందని విమానాశ్రయ నిరసన కమిటీ ప్రకటించడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో, కుటుంబ సమస్యల కారణంగా దివ్య ఆత్మహత్యకు పాల్పడిందని, విమానాశ్రయ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆత్మహత్యకు పాల్పడలేదని, అలాంటి సూసైడ్ నోట్ ఆమె రాయలేదని, కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



దివ్య (ఫైల్‌ఫొటో)

నేటినుంచి చెంగల్పట్టు సబర్బన్ రైళ్ల మార్పులు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైలు మార్గాల్లో మరమత్తుల కారణంగా చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు వెళ్లే సబర్బన్ రైళ్లు బుధవారం నుంచి ఈ నెల 23వ తేది వరకు సింగపెరుమాళ్ కోయిల్ వరకు మాత్రమే నడువనున్నాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై బీచ్ నుంచి ఉదయం 11.40, మధ్యాహ్నం 12.20, 12.40, 1.45, 2.15, 2.45, రాత్రి 9.20 గంటలకు చెంగల్పట్టు వెళ్లే రైళ్లు సింగపెరుమాళ్ కోయిల్ వరకు మాత్రమే నడుస్తాయి. మరుమార్గంలో, చెంగల్పట్టు నుంచి మధ్యాహ్నం 1.45, 2.20, 3.05, 4.05, 4.35, రాత్రి 11 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు చెంగల్పట్టు బదులు సింగపెరుమాళ్ కోయిల్ రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరనున్నాయి.

శ్మశానంలో కళ్లు తెరిచిన వృద్ధురాలు

● భయంతో పరుగులు తీసిన బంధువులు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా వేల్‌కురిచ్చి వద్ద అరవైయేళ్ల బామ్మ మృతదేహానికి అంత్యక్రియలు జరుపుతుండగా ఉన్నట్టుండి ఆమె పైకి లేచి కళ్లు తెరవటంతో బంధువులంతా భయంతో పరుగులు తీశారు. తిరుచ్చి జిల్లాలో కలకలం రేపిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. వేల్‌కురిచ్చిలో నివసిస్తున్న చిన్నమ్మాళ్ (60) వృద్ధాప్యంతో కంటి చూపు మందగించింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో కొద్ది నెలలుగా ఆమె తీవ్రమైన కంటి నొప్పితో బాధపడుతూ మదురైలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. అయినా చూపు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. కంటిలో నొప్పిని భరించలేకపోయింది. చివరకు ఆదివారం సాయంత్రం నొప్పి భరించలేక తోటలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారకస్థితికి చేరింది. దీంతో ఆమె కుమారుడు సుబ్రమణి చికిత్స నిమిత్తం ద్వారకురిచ్చిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాడు. వైద్యులు ఆమెకు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా మారటంతో వైద్యులు ఇక ఆమె బ్రతకటం కష్టమని తేల్చి చెప్పారు. దీంతో చిన్నమ్మాళ్ కుమారుడు, కుటుంబ సభ్యులు, బంధువులంతా ఆమెను ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆమెను అంబులెన్స్‌లో తీసుకుని స్వస్థలానికి బయలుదేరారు. మార్గమధ్యంలో అంబులెన్స్ కుదుపులకు చిన్నమ్మాళ్‌కు పెట్టిన వెంటిలేటర్ కిందపడి ఆమె శ్వాస ఆగిపోయింది. దీనితో కుటుంబీకులంతా ఆమె మరణించినట్టు భావించి మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఊరి ప్రజలకు, బంధువులకు చిన్నమ్మాళ్ అంత్యక్రియలు శ్మశానవాటికలో జరుగనున్నట్లు ఫోన్ చేశారు. అంబులెన్స్ శ్మశానవాటిక వద్దకు చేరక ముందే ఊరి ప్రజలు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని ఖననం చేసేందుకు గోయి తవ్వుతుండగా కొంతమంది మహిళలు చిన్నమ్మాళ్‌పై పడి ఏడుస్తున్న సమయంలో ఉన్నట్టుండి చిన్నమ్మాళ్ కళ్లు తెరచి పైకి లేచింది. అది చూసి కుటుంబీకులు, బంధువులు, ఊరి ప్రజలు తలో దిక్కు పరుగులు తీశారు. పాడెపై నుండి లేచిన చిన్నమ్మాళ్ దాహంగా ఉందని, నీళ్లిమంటూ అడిగింది. కుటుంబ సభ్యులు ధైర్యం చేసుకుని చిన్నమ్మాళ్ దగ్గరగా వెళ్ళి చూసిన మీదట ఆమె ప్రాణాలతోనే ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఆ తర్వాత ఆమెకు నీరు తాగించారు. వెంటనే అంబులెన్స్‌ను రప్పించి చిన్నమ్మాళ్‌ను మెరుగైన చికిత్స కోసం తిరుచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



పాడెపై నుంచి లేచిన చిన్నమ్మాళ్

తెన్ పొన్నై చెరువులో బయల్పడిన రాగి నాణెం

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బ్రనూటి సమీపంలోని తెన్ పొన్నై చెరువు తీరంలో పురావస్తు పరిశోధన శాఖ చేపట్టిన తవ్వకాల్లో పురాతన రాగి నాణెం లభ్యమైంది. ఈ నాణేన్ని పరిశీలించిన పరిశోధకులు, అందులో దేవ నాగరిలిపిలో శ్రీ రాజరాజ అనే పేరుందని, ఇది మొదటి రాజరాజ చోళ చక్రవర్తి కాలం నాటిదని నిర్ధారించారు. ఈ చెరువు తీరంలో చేపట్టిన తవ్వకాల్లో ఇప్పటివరకు ఆదిమానవులు నివసించిన ఇళ్లు, బావులు, రాతి పనిముట్లు, వెండి నాణేలు కూడా లభ్యమైనట్లు అధికారులు తెలిపారు.

అర్ప్పోర్ ఇయక్కమ్‌కు వ్యతిరేకంగా పరువు నష్టం కేసు

కోర్టుకు హాజరైన ఈపీఎస్

పెరంబూర్,నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రహదారుల శాఖ టెండర్లలో అవినీతి జరిగిందంటూ అసత్య ప్రచారాలు చేశారంటూ అర్ప్పోర్ ఇయక్కమ్ వ్యతిరేకంగా దాఖలుచేసిన కేసులో, మాస్టర్ కోర్టులో హాజరైన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి సాక్షమిచ్చారు. అనంతరం ఈ కేసు విచారణ డిసెంబరు 11కు వాయిదావేసిన న్యాయస్థానం, ఆ రోజు కూడా పళనిస్వామి హాజరుకావాలని ఆదేశించింది. 2016-21లో అన్నాడీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పళనిస్వామి, రహదారుల మంత్రిత్వ శాఖ కూడా నిర్వర్తించారు. 2019 నుంచి 2021 వరకు తంజావూరు, శివగంగ, కోయంబత్తూర్ జిల్లాల్లో రహదారుల శాఖ టెండర్లలో అవినీతి జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రహదారుల శాఖ, అవినీతి నిరోధక శాఖలకు అర్ప్పోర్ ఇయక్కం జూలై 22న ఫిర్యాదు చేసింది. మంచి స్థితిలో ఉన్న రోడ్లను మళ్లీ వేసేలా దాఖలైన టెండర్లలో, ప్రాజెక్ట్ వ్యయం పెంచి ప్రభుత్వానికి రూ.692 కోట్ల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ అవకతవకలకు సంబంధించిన వివరాలను అర్ప్పోర్ ఇయక్కం సోషల్ మీడియాలో విడుదల చేసింది. అవి తమ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేవిగా ఉన్నాయంటూ అర్ప్పోర్ ఇయక్కం సమన్వయకర్త జయరాం వెంకటేశ్, ఉప సమన్వయకర్త జాకీర్ హుస్సేన్ తదితరులకు వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పిటిషన్ వేశారు. తనకు వ్యతిరేకంగా అసత్య ప్రచారాలు చేసేందుకు అర్ప్పోర్ ఇయక్కం సమన్వయకర్త, ఉప సమన్వయకర్తలకు నిషేధం విధించాలని పళనిస్వామి పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, పళనిస్వామిపై వ్యాఖ్యానించేందుకు అర్ప్పోర్ ఇయక్కంకు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో సాక్ష్యుల వాంగ్మూలం నమోదుచేయాలని మాస్టర్ కోర్టుకు పంపించారు. ఈ కేసులో సాక్ష్యం ఇచ్చేందుకు మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని మాస్టర్ కోర్టు న్యాయమూర్తి మహాలక్ష్మి ఎదుట, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి మంగళవారం హాజరై, పత్రాలు సమర్పించి సాక్షం ఇచ్చారు. అనంతరం ఈ కేసు విచారణ డిసెంబరు 11వ తేదీకి వాయిదావేసిన కోర్టు, ఆ రోజున పళనిస్వామి మళ్లీ హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు.

● జాఫర్ సాధిక్ కేసు...

ఈడీకి సీబీఐ కోర్టు నోటీసు

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన జాఫర్ సాధిక్‌పై మనీల్యాండరింగ్ కేసు నమోదుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడీ)కి ఈనెల 22వ తేదిలోగా అఫిడవిట్ దాఖలుచేయాల్సిందిగా సీబీఐ న్యాయస్థానం నోటీసు జారీచేసింది. జాఫర్ సాధిక్‌ను జూన్ 26న అరెస్టు చేసిన నేపథ్యంలో, ఆయన సోదరుడు మహమ్మద్ సలీంను కూడా ఆగస్టులో అరెస్ట్ చేశారు. చెన్నై సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతోంది. ఈ కేసులో 302 పేజల ఛార్జిషీటులో జాఫర్ సాధిక్, ఆయన భార్య అమీనాభాను, సోదరుడు మహమ్మద్ సలీం, తమిళ సినీ దర్శకుడు అమీర్ సహా 12 మందికి, అలాగే, జాఫర్ సాధిక్ సినీ నిర్మాణ సంస్థ సహా 8 సంస్థలను ముద్దాయిలుగా చేర్చారు. ఇదిలా ఉండగా, జాఫర్ సాధిక్ సోదరులు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సీబీఐ న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. మంగళవారం ఈ కేసు విచారణకు రాగా, జాఫర్ సాధిక్ బెయిలు పిటిషన్‌కు సంబంధించి ఈ నెల 22వ తేదిలోపు అఫిడవిట్ దాఖలుచేయాలని ఈడీకి ఉత్తర్వులు జారీచేసిన న్యాయస్థానం, విచారణ వాయిదావేసింది.

చిదంబరంలో ధ్వజస్తంభం తొలగించొద్దు

● మద్రాసు హైకోర్టు

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న తిల్లై గోవిందరాజ పెరుమాళ్ సన్నిధి ముందున్న ధ్వజస్తంభాన్ని తొలగించరాదంటూ మద్రాసు హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తిల్లై గోవిందరాజ పెరుమాళ్ సన్నిధిలో మార్గళి మాసంలో నటరాజస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఇక్కడ నిర్వహించే ఆరుద్ర దర్శనం వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఆణి మాసంలో తిరుమంజనం దర్శన ఉత్సవాలు కూడా కోలాహలంగా నిర్వహిస్తుంటారు. భక్తుల కోరిక మేరకు గోవిందరాజ పెరుమాళ్‌కు బ్రహ్మోత్సవం నిర్వహించాలని ఆలయ నిర్వాహక ధర్మకర్త సుదర్శన్, భట్టాచార్యులు నిర్ణయించారు. ఇందుకోసం ఈ సన్నిధిలో శిధిలావస్థకు చేరుకున్న ధ్వజస్తంభాన్ని తొలగించి కొత్తగా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హరిహరన్ అనే భక్తుడు దాఖలుచేసిన పిటిషన్ మంగళవారం మళ్లీ విచారణకు వచ్చింది. ఇరుతరపు వాదనల అనంతరం ధ్వజస్తంభాన్ని తొలగించరాదని చిదంబరం మేజిస్ట్రేట్ కోర్టు జారీచేసిన ఉత్తర్వులు ఉల్లంఘించరాదంటూ ఈ కేసుకు మద్రాసు హైకోర్టు ముక్తాయింపు పలికింది.

న్యాయవాది హత్యకేసులో మహిళకు యావజ్జీవం

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది కామరాజ్ హత్యకేసులో ఓ మహిళకు మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ మంగళవారం యావజ్జీవ జైలుశిక్ష విధించింది. కేంద్ర మాజీ మంత్రి దళిత్ ఏళిల్‌మలై అల్లుడు కామరాజ్ మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా వ్యవహరించారు. ఆయన 2014వ సంవత్సరంలో కొళత్తూర్ సమీపంలోని రెట్టేరిలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో హత్యకు గురయ్యారు. దీనిపై కొళత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి కల్పన, కార్తీక్, ఆనంద్‌లను అరెస్ట్ చేశారు. తిరువళ్లూర్ జిల్లా సెషన్స్ కోర్టులో సాగిన ఈ హత్య కేసు విచారణను వేరే కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2015లో సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ ఈ కేసు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో, తొమ్మిదేళ్లుగా సాగిన ఈ కేసుకు సంబంధించి సాక్షుల విచారణ, ఇరుతరపు న్యాయవాదులు వాదనలు పూర్తికావడంతో మంగళవారం తీర్పు వెలువడింది. ఇందులో కల్పనను నేరస్తురాలిగా ప్రకటించిన న్యాయమూర్తి కేకే రామకృష్ణన్, ఆమెకు యావజ్జీవ జైలు విధించారు. ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్న ఆనంద్, కార్తీక్‌లను విడుదల చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

అధిక వ్యాయామంతో జిమ్ ఓనర్ మృతి

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక సమయం వ్యాయామం చేసిన జిమ్ యజమాని సేతు అలియాస్ మహతీర్ మహమ్మద్ (35) మృతిచెందిన ఘటన కలకలం రేపింది. సేలం కోట ప్రాంతానికి చెందిన మహతీర్ 31వ వార్డు డీఎంకే మాజీ కార్యదర్శిగా వ్యవహరిస్తూ రివర్ సైడ్ నార్త్ వీధిలో జిమ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆయన ప్రతిరోజు జిమ్‌లో వ్యాయాయం చేస్తుంటాడు. సోమవారం రాత్రి 7 గంటలకు మహమ్మద్ జిమ్‌కు వచ్చాడు. అతని తర్వాత వచ్చిన వారు 8 గంటలకు తిరిగి వెళ్లగా, మహమ్మద్ మాత్రం వ్యాయామం చేశారు. అనంతరం జిమ్ ప్రాంగణంలో స్నానాల గదికి వెళ్లిన మహమ్మద్ స్పృహ తప్పి పడిపోయాడు. చాలాసేపటి వరకు అతను బయటకు రాకపోవడంతో జిమ్‌లోని వారు అనుమానంగా తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా, అచేతనంగా పడి ఉన్న మహమ్మద్‌ను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న సేలం పోలీసులు జిమ్ సెంటర్‌కు చేరుకొని, అక్కడి సీసీ ఫుటేజీ పరిశీలించారు. అధిక సమయం వ్యాయామం చేయడంతో అతను మృతిచెందాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



మహతీర్ మహమ్మద్ (ఫైల్‌ఫొటో)

మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో కానిస్టేబుల్ అరెస్ట్

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలాంగరై ప్రాంతంలో చట్టవిరుద్ధంగా మాదకద్రవ్యాలు తరలించిన నేరస్తులకు మద్దతుగా వ్యవహరించిన కానిస్టేబుల్ భరణి (32)ను మంగళవారం అరెస్ట్ చేశారు. నీలాంగరై ప్రాంతానికి మాదకద్రవ్యాలు విక్రయించిన రఘు, కన్నన్, జనార్థన్ అనే వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని విచారించగా అయనావరం పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ భరణి తమకు సహకరించినట్లు తెలిసింది. దీంతో, ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, భరణిని పోలీస్ కమిషనర్ తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.

ఏటీఎం కేంద్రంలో మంటల వ్యవహారం

ఫోరెన్సిక్ నిపుణుల పరిశీలన

తిరుత్తణి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలోని ఏటీఎం కేంద్రంలో సంభవించిన అగ్నిప్రమాదంపై ఫోర్సెనిక్ నిపుణులు విచారణ చేపట్టారు. కనకమ్మసత్రం బజార్‌లో ఓ ప్రైవేటు బ్యాంకు చెందిన ఏటీఎం కేంద్రంలో మంగళవారం సాయంత్రం హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఏటీఎం మెషీన్ దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, ఫోర్సెనిక్ నిపుణులతో అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. కాగా, మెషీన్‌లో ఉన్న రూ.10 లక్షలు భద్రంగా ఉందా అనే విషయం విచారణ అనంతరం తెలుస్తుందని పోలీసులు తెలిపారు.



మంటల్లో దహనమైన ఏటీఎం మెషీన్

వ్యభిచారం చేస్తున్న ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మడిపాక్కంలోని ఓ ఇంట్లో వ్యభిచారం చేస్తున్న మహిళ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీసు శాఖ పరిధిలోని వ్యభిచార నిరోధక విభాగం-2 అధికారులకు అందిన సమాచారంతో మడిపాక్కంలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టి వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో సైదాపేట జ్యోతియమ్మాళ్ నగర్‌కు చెందిన పూర్ణిమ అలియాస్ ఝాన్సీ (35), నామక్కల్ జిల్లా తిరుచెంగోడుకు చెందిన రవి (54)లను అరెస్ట్ చేసిన పోలీసులు, ముగ్గురు యువతులను రక్షించి ప్రభుత్వ హోంకు తరలించారు. కాగా, వ్యభిచారం వృత్తి సాగిస్తున్న వ్యవహారంలో పూర్ణిమపై మూడు కేసులు, రవిపై ఒక కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



విజేతలతో శివకుమారి, హెచ్‌ఎం అనిలా తదితరులు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా వారిని ప్రోత్సహించాలని 324ఎం సౌత్ సిటీ అధ్యక్షురాలు డా.ఏవీ శివకుమారి పిలుపునిచ్చారు. ప్రతినెలా తన సొంత ఖర్చుతో సేవా కార్యక్రమాలను ఏవీ శివకుమారి చేపడుతుంటారు. ఆ క్రమంలో, తాను చదివిన జార్జిటౌన్‌లోని కేటీసీటీ హయ్యర్ సెకండరీ స్కూలు విద్యార్థులకు క్రాఫ్ట్, డ్రాయింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, పాటలు, నృత్యం తదితర పోటీలు నిర్వహించారు. ఆ విభాగాల్లో మొదటి, రెండో స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు శివకుమారి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘననివాళి



ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు తిరునావుక్కరసర్, తంగబాలు, చిరంజీవి తదితరులు

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించి, పేదలకు సంక్షేమ సహాయాలను పంపిణి చేశారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీలు తిరునావుక్కరసర్, కేవీ తంగబాలు, నేతలు కె.చిరంజీవి, ఎస్‌ఏ వాసు, శివరాజశేఖరన్, అరుంబాక్కం వీరపాండ్యన్ తదితరులు ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అదే విధంగా సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపం ఎలిఫెంట్ గేట్ జంక్షన్‌లో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి కౌన్సిలర్ ద్రవ్యం నేతృత్వంలో నివాళులర్పించారు.

కూటమిలో చేరేవారు రూ.100 కోట్లు డిమాండ్ చేస్తున్నారు

- మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్



తిరుచ్చి జిల్లా అన్నాడీఎంకే నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న దిండుగల్ శ్రీనివాసన్

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమిలో చేరేవారు తమకు 20 సీట్లు, రూ.100 కోట్లు కావాలని డిమాండ్ చేస్తున్నారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. తిరుచ్చి జిల్లా అన్నాడీఎంకే కార్యకర్తల సమావేశం మంగళవారం తిరుచ్చిలో జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రులు తంగమణి, గోకుల ఇందిర సహా దిండుగల్ శ్రీనివాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిండుగల్ శ్రీనివాసన్ మాట్లాడుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వన్‌మాన్ ఆర్మీలాగా పార్టీ నడిపిస్తున్నారని, ఆయన ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక తీరు ఎండగడుతున్నారని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లోగా అన్నాడీఎంకేను మరింత బలోపేతం చేసేలా ఈపీఎస్ వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీలో కొన్ని జిల్లాల్లో నేతల మధ్య ఉన్న విభేధాలను తొలగించాలన్న దృక్పథంతోనే జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కూటమికి వస్తున్న వారు తమ పార్టీకి 20 సీట్లు, రూ.100 కోట్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

వండలూర్‌లో పిల్లకు జన్మనిచ్చిన నీటి ఏనుగు ?

వేళచ్చేరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో ఐదు ఆడ, రెండు మగ మొత్తం ఏడు నీటి ఏనుగులున్నాయి. వీటిలో ప్రకృతి అనే నీటి ఏనుగు ఆగస్టు 21న ఓ పిల్లకు జన్మనివ్వగా, ఆ పిల్ల తల్లితో తిరిగే ఫొటోలను 25వ తేది పార్క్ యాజమాన్యం విడుదల చేసింది. కానీ, పుట్టిన 8 రోజుల్లోనే పిల్ల నీటి ఏనుగు మృతిచెందింది. పిల్ల నీటి ఏనుగు మృతిచెందడం పార్క్ ఉద్యోగులను, జంతు ప్రేమికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన అనంతరం నీటి ఏనుగులుండే పంజరాన్ని సందర్శకులు తిలకించేందుకు వీలులేకుండా మూసివేశారు. ఈ నేపథ్యంలో, ఓ నీటి ఏనుగు ఆదివారం ఓ పిల్లకు జన్మనిచ్చినట్లు సమాచారం. ఈ విషయాన్ని పార్క్ అధికారులు గోప్యంగా ఉంచారు. ఈ విషయమై తెలుసుకొనేందుకు పలువురు జంతు ప్రేమికులు పార్క్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభును ఫోన్‌లో సంప్రదించాలని యత్నించినా వీలుపడలేదని సమాచారం.

మెట్రో రైల్ రూట్ 4లో పూర్తయిన స్తంభాల నిర్మాణం

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టులోని రూట్ నెంబర్ 4లో ఎనిమిది కిలోమీటర్ల మేర పునాది స్తంభాల నిర్మాణ పనులు వందశాతం పూర్తయినట్లు సీఎంఆర్‌ఎల్ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఆ సందర్భంగా ఆ నిర్మాణ పనుల్లో పాల్గొన్న కార్మికులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. రూట్ నెంబర్ 4లో కోడంబాక్కం పవర్ హౌస్ నుంచి పోరూరు కూడలి వరకు పిల్లర్ పనులు వందశాతం మేర పూర్తయినట్లు అధికారులు తెలిపారు.



కార్మికులతో మెట్రోరైలు ఉన్నతాధికారులు

చిత్రజ్యోతి

నస్రియా



ఐశ్వర్య లక్ష్మి



పార్వతి నాయర్



ఏకతాటిపై మలయాళ భామలు!?

- నయన్ - ధనుష్ వివాదంపై స్పందన
- ఎవరికి మద్దతు.. ఎవరికి వ్యతిరేకం?

హీరో ధనుష్, హీరోయిన్ నయనతార మధ్య చెలరేగిన వివాదంలో పలువురు యువ హీరోయిన్లు ఒక్కతాటిపైకి వచ్చారు. ముఖ్యంగా మలయాళ భామలంతా ఏకమై సహ నటి నయనతారకు అండగా నిలబడటం ఇపుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. నయనతార జీవిత చరిత్ర ఆధారంగా నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఒక డాక్యుమెంటరీ రూపొందింది. ఇందుకోసం ధనుష్ నిర్మాతగా రూపొందించిన 'నానుమ్ రౌడీ దాన్' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను 3 నిమిషాల టీజర్‌లో నయనతార వాడుకున్నారు. దీనికి ధనుష్ రూ.10 కోట్లు చెల్లించాలంటూ లీగల్ నోటీసు పంపించారు. అంతే.. నయనతార ఒక్కసారిగా ఉగ్ర రూపం దాల్చారు. హీరో ధనుష్‌ను చీల్చి చెండాడుతూ ఒక ప్రకటన చేశారు. ధనుష్‌ను లక్ష్యంగా చేసుకుని నయనతార చేసిన వ్యాఖ్యలకు సినీ ప్రముఖులు, మూవీ లవర్స్ వ్యతిరేక, సానుకూల స్పందనలు చెరి సమానంగానే ఉన్నాయని చెప్పొచ్చు. అయితే మలయాళ భామలైన నస్రియా, ఐశ్వర్య లక్ష్మి, పార్వతి నాయర్, అనుపమ పరమేశ్వరన్ వంటి మరికొందరు హీరోయిన్లు నయనతార పోస్టుకు లైక్ చేసి, ఆమెకు తమ నైతిక మద్దతు తెలిజేశారు. ప్రధానంగా చిత్రపరిశ్రమలో ఏ చిన్న సంఘటన జరిగినా పార్వతి నాయర్ ముందుగా ప్రకటన రూపంలో తన అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తం చేస్తుంటారు. ఇపుడు నయనతారకు అండగా నిలిచిన మలయాళ హీరోయిన్లందరూ హీరో ధనుష్ సరసన ఒక్కో చిత్రంలో నటించారు. 'మరియాన్' మూవీలో పార్వతి, 'నైయాండి'లో నస్రియా, 'జగమే తందిరం'లో ఐశ్వర్య లక్ష్మి నటించారు. ఇందులో 'నైయాండి' షూటింగ్ ఆఖరులో నస్రియా చెప్పాపెట్టకుండా తప్పుకున్నారు. చిత్ర ప్రమోషన్ కార్యక్రమాలకు కూడా ఆమె దూరంగా ఉన్నారు. ఇకపోతే, 'మరియన్' కోసం అతి సన్నిహితంగా ఉండే సన్నివేశాల్లో నటించాల్సిన రావడంతో పార్వతి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ధనుష్‌తో నటించిన ఈ మలయాళ భామలంతా, ఇపుడు నయనతార అంశంతో బయటకు వచ్చారు. అన్నికంటే ముఖ్యంగా నయనతార కూడా సహనటి, కేరళ వాసి కావడంతో వారు అండగా నిలబడ్డారా? లేక ధనుష్ చిత్రాల్లో నటించే సమయంలో తమకు ఎదురైన చేదు అనుభవాలకు ఇపుడు తమ వ్యతిరేకతను ఈ రూపంలో వ్యక్తం చేశారా? అనే చర్చ కోలీవుడ్‌లో సాగుతుంది. మొత్తంమీద నయనతార - ధనుష్ వివాదంలో కేరళ భామలంతా స్పందించడం కోడంబాక్కం వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

మరో మెట్టుకు చేర్చే చిత్రం 'కంగువా'

- పరోటా సూరి

హీరో సూర్య నటించిన 'కంగువా' తమిళ సినిమాను మరో మెట్టుకు తీసుకెళ్ళే సినిమా అని, అలాంటి అద్భుతమైన మూవీని ఒకరిద్దరు మాత్రమే బాగాలేదని చెబుతున్నారని నటుడు పరోటా సూరి అభిప్రాయపడ్డారు. తిరుచ్చెందూరు సుబ్రమణ్యస్వామిని ఆయన దర్శనం చేసుకున్నారు. షణ్ముగర్, వల్లి తాయార్, పెరుమాళ్, దక్షిణామూర్తి, శత్రుసంహార మూర్తి సన్నిధుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'వచ్చే నెల 20వ తేదీ తాను హీరోగా నటించిన 'విడుదలై-2' చిత్రం విడుదలకానుంది. ఇప్పటికే ఆ చిత్రంలోని ఆడియోకు మంచి స్పందన వచ్చింది. కమెడియన్‌గా, హీరోగా ప్రేక్షకదేవుళ్ళు గుర్తింపునిచ్చారు. ప్రశాంత్ దర్శకత్వంలో వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నారు. పలు చిత్రాల్లో నటించే అవకాశాలు వస్తున్నాయి. వెట్రిమారన్ దర్శకత్వంలో కూడా మరో ఛాన్స్ వచ్చింది. త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తాం. నటుడు సూర్య నటించిన 'కంగువా' ఒక అద్భుతమైన మూవీ. బాగా లేదన్నది ఒకరిద్దరి అభిప్రాయం మాత్రమే. తమిళ సినిమాను మరోస్థాయికి చేర్చే చిత్రంగా నేను భావిస్తాను' అని పేర్కొన్నారు.



తిరుచ్చెందూరు ఆలయంలో సూరి

చిత్రపరిశ్రమను నాశనం చేస్తున్నారు

- యూట్యూబర్స్‌పై తిరుపూర్ సుబ్రమణియన్ ఫైర్



ఈ యేడాదిలో భారీ బడ్జెట్ చిత్రాల కలెక్షన్లు తగ్గిపోవడానికి యూట్యూబర్లే ప్రధాన కారణమని తమిళనాడు థియేటర్స్ అండ్ మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపూర్ సుబ్రమణియన్ ఆరోపించారు. ఈ యూట్యూబర్స్ చిత్రపరిశ్రమను నాశనం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ఆడియో విడుదల చేశారు. 'ప్రేక్షకులు వచ్చి సినిమా చూసిన తర్వాత.. ఆ సినిమా బాగుంది, బాగాలేదు అనడం వేరు. కానీ, ఇపుడు పుట్టగొడుగుల్లా వచ్చిన యూట్యూబ్ చానెల్స్ నెగిటివ్ రివ్యూలను పోస్ట్ చేస్తున్నాయి. ఒక వ్యక్తికి ఒక చిత్రం నచ్చలేదంటే అది అతని వ్యక్తిగత అభిప్రాయం. ఇళయరాజాకు 'ముదల్ మరియాదై' నచ్చలేదని చెప్పినట్టుగా గతంలో విన్నాం. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో వ్యక్తిగత అభిప్రాయం ఉంటుంది. 'అన్నకిలి', 'ఒరుతలై రాగం', '16 వయదినిలే', 'సేతు' వంటి చిత్రాలకు తొలివారంలో ప్రేక్షకుల ఆదరణ లేదు. ఆ తర్వాత మౌత్ టాక్ తో సూపర్‌డూపర్ హిట్స్ సాధించాయి. కానీ, ఇపుడు ఒక సినిమా వేకువజామునే చూసి, చెవుల్లో రక్తం వస్తుందని, తల నొప్పిగా ఉందంటూ దారుణమైన రివ్యూలు ఇస్తున్నారు. ఈ కారణంగా అనేక భారీ బడ్జెట్ చిత్రాలు ఆశించిన స్థాయిలో కలెక్షన్లు రాబట్టలేకపోయాయి. యూట్యూబర్స్‌ను థియేటర్లలోకి అనుమతించవద్దని పదేపదే కోరుతున్నాం. అలాగే, సినిమాపై బహిరంగంగా విమర్శలు చేయకుండా ఉండేలా కోర్టులో నిర్మాతలు కేసులు వేయాలి' అని కోరారు.



'వనంగాన్'లో అరుణ్ విజయ్

సంక్రాంతి బరిలో 'వనంగాన్'

బాలా దర్శకత్వంలో అరుణ్ విజయ్ హీరోగా నటించిన 'వనంగాన్' మూవీని సంక్రాంతికి విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఓ పోస్టరు ద్వారా వెల్లడించారు. హీరో అరుణ్ విజయ్ మంగళవారం తన పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రం రిలీజ్‌పై దర్శకనిర్మాతలు క్లారిటీ ఇచ్చారు. అయితే, విడుదల తేదీని మాత్రం వెల్లడించలేదు. ప్రముఖ నిర్మాత సురేష్ కామాక్షి 'వి హౌస్' ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించే ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. ఇప్పటివరకు ఈ సినిమా టీజర్ రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చింది. ఇందులో హీరో ఎలాంటి డైలాగులు లేకుండా మూగ పాత్రలో కనిపించారు. ఇతర పాత్రల్లో సముద్రఖని, మిష్కిన్, రిధా, చాయాదేవి, బాలా శివాజీ, షణ్ముగరాజన్, డాక్టర్ యోహన్ చాకో, కవిత గోపి, బృంద సత్యమూర్తి, అరుళ్‌దాస్ తదితరులు నటించారు.

తిరువళ్లువర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలు

- ముస్తాబవుతున్న కన్నియాకుమారి



ముస్తాబు చేస్తున్న కార్మికులు



రంగులతో సిద్ధమవుతున్న గ్యాలరీలు

వేళచ్చేరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లువర్ విగ్రహం ఏర్పాటుచేసి 25 ఏళ్ల పూర్తిచేసుకోవడంతో సిల్వర్ జూబ్లీ వేడుకలు చేస్తున్నారు. సిల్వర్ జూబ్లీతో పాటు తిరువళ్లువర్ విగ్రహం-వివేకానంద రాక్‌లను కలిపే అద్దాల వంతెన ప్రారంభోత్సవం కోసం కన్నియాకుమారి ముస్తాబవుతోంది. తిరువళ్లువర్ విగ్రహం సిల్వర్ జూబ్లీ వేడుకలు డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి స్టాలిన్, అద్దాల వంతెన ప్రారంభించనున్నారు. ఈ వేడుకల సందర్భంగా త్రివేణి సంగమం, సునామీ పార్క్, ట్రయాంగిల్ పార్క్, సన్ రైజ్, సన్ సెట్ ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు. అలాగే, ఈ ప్రాంతాల్లో పర్యాటకుల కూర్చొనేలా సీట్ల సదుపాయం, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ప్రత్యేక వసతులు చేపడుతున్నారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలను రంగురంగులతో ముస్తాబు చేస్తున్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

తాంబరం-వేళచ్చేరి రోడ్డులో ఆక్రమణల తొలగింపు

వేళచ్చేరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం-వేళచ్చేరి రోడ్డు పక్కన ఆక్రమణలు అధికారులు తొలగించారు. తాంబరం-వేళచ్చేరి రోడ్డుపై 24 గంటలు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయి. రద్దీగా మారిన ఈ రోడ్డు ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేశారు. ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు వీలులేక పాదచారులు రోడ్డుమీద నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఈస్ట్ తాంబరం నుంచి భారతమాత రోడ్డు జంక్షన్, సేలయూరు పోలీస్‌స్టేషన్ నుంచి క్యాంప్ రోడ్డు జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెలిశాయి. వాటిపై ప్రజలు అందజేసిన ఫిర్యాదుకు స్పందించిన రహదారుల శాఖ, సోమవారం ఈస్ట్ తాంబరం నుంచి సేలయూరు వరకు వెలసిన ఆక్రమణలను తొలగించింది. మంగళవారం కూడా ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



చెన్నై కొరట్టూరులోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయంలో ఉత్తమ సేవలందించిన గ్రంథాలయాధికారులకు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ స్మారక అవార్డులు ప్రదానం చేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్



కృత్రిమ కాళ్లు పెట్టుకున్న లబ్ధిదారులు

110 మందికి కృత్రిమ కాళ్లు

వేళచ్చేరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ టి.నగర్ (ఆర్‌సీఎంటీ), 'ముక్తి' (ఎంఎస్ దాదా ఫౌండేషన్) సంయుక్త ఆధ్వర్యంలో 110 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు పెట్టారు. వేళచ్చేరిలోని జైన్ కళాశాలలో ఆర్‌సీఎంటీ ప్రెసిడెంట్ నరేంద్ర శ్రీమల్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ దాదా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మీనా దాదా, సీఈవో మిటా గొలేఛా, ఆర్‌సీఎంటీ కార్యదర్శి డాక్టర్ పూర్ణిమా కార్తీక్, డైరెక్టర్ లక్ష్మి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



'ఆక్యుపేషనల్ థెరపీ'పై అవగాహన కల్పిస్తూ చెన్నై బీసెంట్ నగర్ బీచ్‌లో వాక్‌థాన్ నిర్వహిస్తున్న రామచంద్ర మెడికల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది



వీధిలో వరినాట్లు

ఈ మహిళలు వరినాట్లు వేసేది పొలంలో కాదు.. వీధిలో. వర్షపు నీటితో తమ ఇళ్ల మధ్యలో ఉన్న వీధి మడుగులా మారింది. ఆ వీధికి మట్టి తోలించడంలో పాలకుల నిర్లక్ష్యానికి నిరసనగా మంగళవారం వరినాట్లు వేశారు. ఈ ఘటన మంగళవారం దొరవారిసత్రం మండలం కల్లూరులో జరిగింది. ఏళ్ల తరబడి మడుగులా ఉన్న తమ వీధికి మట్టి తోలమని స్థానిక పంచాయతీ పాలకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

\- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

నడుములు విరగతాయ్!

ఈ రోడ్డున వెళ్లేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా నడుములు విరగాల్సిందే. చంద్రగిరి-అనుప్పల్లె మార్గంలో మల్లయ్యపల్లె మలుపు వద్ద ఉన్న గుంతకు ఇటీవల అధికారులు తాత్కాలికంగా మట్టి పోశారు. వర్షాలకు మళ్లీ యథాస్థితికి చేరింది. ఇటీవల ద్విచక్ర వాహనదారుడు నడిరోడ్డుపై ఉన్న ఈ గుంతను చివర్లో చూసి అదుపు చేయలేక కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

\- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



మల్లయ్యపల్లె వద్ద అదుపు తప్పి గాయపడిన ప్రయాణికుడు

అలారం మోగింది.. దొంగ పరారయ్యాడు



ఏటీఎం డోర్‌ను గునపంతో కొడుతున్న దుండగుడు



- నాయుడుపేటలో ఏటీఎం చోరీకి విఫలయత్నం

నాయుడుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గునపం తెచ్చాడు. ఏటీఎంను పగలగొట్టే ప్రయత్నం చేశాడు. ఇంతలో అలారం మోగడంతో.. దొంగ పరారయ్యాడు. లేదంటే ఏటీఎంలో నగదు అపహరించుకుని వెళ్లేవాడేమో? ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నాయుడుపేట బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది.

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో యాక్సెస్ బ్యాంకు ముందు గదిలో ఏటీఎం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం బ్యాంకు సిబ్బంది విధులను ముగించుకొని బ్యాంక్ షట్టర్ మూసేసి వెళ్లారు. అయితే ఏటీఎం గది మాత్రం తెరిచే ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఓ దుండగుడు మోటారు సైకిల్‌పై గునపంతో వచ్చాడక్కడకు. బ్యాంక్ ముందు మోటారు సైకిల్‌ను పెట్టాడు. ముఖానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టుకొని, గునపం తీసుకుని ఏటీఎంలోకి వచ్చాడు. గునపంతో ఏటీఎం ముందు డోర్‌ను తొలగించాడు. అదే సమయంలో అలారం మోగింది. ఆ సమాచారం బ్యాంక్ హెడ్ ఆఫీసుకు వెళ్లింది. అక్కడ నుంచి నాయుడుపేట బ్యాంక్ మేనేజర్‌కు తమ ఏటీఎం వద్ద చోరీ జరుగుతున్నట్లు సమాచారం అందించారు. తక్షణమే బ్యాంక్ మేనేజర్.. అర్బన్ సీఐ బాబికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో రాత్రి గస్తీలో ఉన్న సీఐ.. హుటాహుటిన ఏటీఎం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ దుండగుడు పరారయ్యాడు. ఏటీఎంలో ఉన్న నగదు మాత్రం చోరీకి గురికాలేదని సీఐ వెల్లడించారు.

సీసీ కెమెరాల్లో దుండగుడు

మోటారు సైకిల్‌పై ఏటీఎం దగ్గరకు చేరుకొని తిరిగి బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలోకి దుండగుడు ప్రవేశించిన సన్నివేశాలు సీసీ కెమెరాలలో నమోదయ్యాయి. అయితే ఎదురుగా వీధిలోకి ప్రవేశించిన తరువాత ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటి వద్ద ఉన్న కెమెరాలో మాత్రం వీధిలోకి వెళ్తున్నది కనిపించింది. ఆ తర్వాత కెమెరాలు లేకపోవడంతో దుండగుడు ఎలా వెళ్లాడనేది అంతుపట్టడం లేదు. యాక్సెస్ బ్యాంక్ ఏటీఎం వద్ద రాత్రి సమయంలో సెక్యూరిటీ లేదని తెలిసి చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. ఇక, క్లూస్ టీమ్ ఎస్ఐ దస్తగిరి సంఘటనాస్థలికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

రద్దీ ప్రాంతంలో..

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు పక్కనే యాక్సెస్ బ్యాంకు ఏటీఎం ఉంది. రాత్రి వేళల్లో ఎప్పుడూ తిరుపతికి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలతో ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. పోలీస్ గస్తీ కూడా అదే రహదారిలో ఉంటుంది. అయినా దుండగుడు గునపం తీసుకొని మోటారు సైకిల్‌పై వచ్చి చోరీకి యత్నించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది.



చోరీకి యత్నించిన ఏటీఎం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

- సమీక్షలు - సమావేశాలు

సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కల్పించండి



సీఎం సూర్యఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులు

- అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్‌తో కలిసి ఆయన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకాన్ని అమలు పరచడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటిపైభాగంలో సౌర విద్యుత్ తయారు చేసుకుని వినియోగించుకోవచ్చన్నారు. దీనికి ప్రోత్సాహంగా ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు, ఆపైన యూనిట్లకు రూ.78వేలు చొప్పున కేంద్రం రాయితీ ఇస్తుందని వివరించారు. ఆసక్తి గల వారు 'పీఎంఎస్‌యూఆర్‌వైఏజీహెచ్ ఏఆర్.జీవోవీ.ఇన్, ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 ద్వారా సంప్రదించాలని సూచించారు. 100 కిలో వాట్లకు పైబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్‌వీవీఎన్, నెడ్ క్యాప్ ఫేజ్-1 సౌర విద్యుత్ ప్లాంట్లు అమర్చడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, మోడల్ సోలార్ విలేజ్ కోసం 5000 జనాభా ఉన్న ఐదు గ్రామాలను తీసుకుని సోలార్ గ్రామాలుగా తీర్చి దిద్దే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జిల్లాలో 112 ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించినట్లు నెడ్‌క్యాప్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జుబేదా, డీపీవో సుశీల దేవి, లీడ్ బ్యాంక్ మేనేజరు విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజరు సునీల్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ పాల్గొన్నారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయండి

జాతీయ రహదారి, రైల్వేశాఖ, రెవెన్యూకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి భూసేకరణపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఎప్పటికప్పుడు ఎన్.హెచ్. అధికారులతో సమన్వయం చేసుకుని రహదారుల పనులు పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. కాలూరు- పీలేరు, రేణిగుంట- నాయుడుపేట, గూడూరు- సూళ్లూరుపేటకు సంబంధించిన సాగరమాల రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనులు చేపట్టండి

తిరుపతి నగరంలోని చెరువుల సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నగరంలోని వివిధ చెరువులు, కుంటల సుందరీకరణ పనుల పురోగతిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్‌తో కలిసి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి చెరువులు పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వినాయక సాగర్, పాన్‌చెరువు, గొల్లవానికుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్, గొల్లవానిగుంట అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తుడా అవిలాలచెరువు అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను టీటీడీ గురువారం విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఉంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ టికెట్లను గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. కాగా, మరి కొన్ని ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ కోటాను టీటీడీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వీటిని భక్తులు బుధవారం ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఇక, అంగప్రదక్షిణ టికెట్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు విడుదల చేయనున్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు.

ఈ విద్యార్థి ఏమయ్యాడు?



కాశ్యప ఆదిత్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఫైనలియర్ చదువుకుంటున్న కాశ్యప ఆదిత్య (19) అదృశ్యమయ్యాడు. ఈమేరకు ఆదిత్య సోదరుడు హైదరాబాదు నుంచీ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అదృశ్యమైన విద్యార్థికి సంబంధించిన ఫోన్, ఐడీ కార్డు సంస్కృత వర్సిటీలోని గరుడాచలం హాస్టల్‌లోనే వదిలి వెళ్ళినట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆటోలో బయటికి వెళ్ళినట్టు యూనివర్సిటీ హాస్టల్ సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వెస్ట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

24నుంచి గ్రామీణ ప్రీమియర్‌లీగ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 16వ గ్రామోత్సవం, రూరల్ ప్రీమియర్‌లీగ్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీ శుభంబన్సల్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహేబ్, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. 24న ఎస్వీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తొలివిడతగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు జరుగనున్నాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న ప్రతి పంచాయతీ క్రీడా జట్లు ఈ పోటీలకు అర్హులు. ముందస్తు నమోదు తప్పనిసరి. మరిన్ని వివరాల కోసం 83000 30999 నెంబరులో సంప్రదించాలి. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకొన్న జట్లు జోనల్‌స్థాయి పోటీలకు అర్హత సాధించి విజయవాడలో డిసెంబరు మొదటి వారంలో జరిగే పోటీలలో పాల్గొంటారు. అక్కడి విజయం సాధించిన జట్లు డిసెంబరు 28న కోయంబత్తూరులోని ఇషా కేంద్రంలో జరిగే తుది సమరంలో పాల్గొంటాయి.

- వాలీబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.9వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలు, నాలుగో బహుమతి రూ.2వేలు.
- త్రోబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, నాల్గో బహుమతి రూ.1,500.



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడండి

రామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుట్టుగుంట రామాపురంలో సర్వే నంబరు 102లోని 288 ఎకరాలను ఆర్డీవో రామ్మోహన్ మంగళవారం పరిశీలించారు. గతంలో గంగిరెడ్డిపల్లి, మిట్టూరు, సి.రామాపురం దళితులకు 141 ఎకరాలను కేటాయించామని అధికారులు ఆయనకు వివరించారు. అన్నస్వామి గండిచెరువుకు 20 ఎకరాలు, కాలువలు, రహదారులకు 28 ఎకరాలు కేటాయించామన్నారు. ఇక్కడ ప్రభుత్వ భూమి 58 ఎకరాలు ఉన్నట్లు ఆర్డీవో గుర్తించారు. అన్నాసామి గండిచెరువు, సీజేఎఫ్ఎస్ భూములు, రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దారు వెంకటరమణ, సర్వేయర్ రమేష్‌బాబును ఆదేశించారు. 58 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు ల్యాండ్ బ్యాంకింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.



మాల కార్పొరేషన్ సభ్యురాలిగా కుమారమ్మ

తిరుపతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యురాలిగా తిరుపతికి చెందిన తెలుగు మహిళా నేత పురిమిట్ల కుమారమ్మ నియమితులయ్యారు. ఎస్సీల సంక్షేమం కోసం కృషిచేస్తానని ఆమె చెప్పారు.

అభివృద్ధికి పచ్చజెండా

- 'పద్మావతి' వర్సిటీ పాలకమండలిలో పలు తీర్మానాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో అభివృద్ధికి మంగళవారం జరిగిన పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర ఉన్నత విద్య, ఆర్థిక శాఖల అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొనగా, పద్మావతి వర్సిటీ నుంచీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. ఇటీవల యూనివర్సిటీకి మంజూరైన రూ.100 కోట్ల పీఎం ఉష పథకం నిధులను భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడంపై చర్చించారు. విద్యుత్ ఖర్చును తగ్గించడం కోసం సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు పాలకమండలి పచ్చజెండా ఊపింది. వెబ్‌సైట్, ఇంటర్‌నెట్, సీసీ ఫుటేజీల నిర్వహణ, వంటి అంశాల్లో నాణ్యతను పెంపొందించాలని తీర్మానించినట్టు తెలిసింది.

14 చోట్ల రెవెన్యూ తనిఖీలు

- రౌడీ సీజింగ్ రాజా నివాసంలోనూ

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్ స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయి, ఎన్‌కౌంటర్‌లో హతమైన రౌడీ సీజింగ్ రాజా ఇల్లు సహా 14 చోట్ల ఒకే సమయంలో సుమారు 200 మంది రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో సీజింగ్ రాజా దాదాగిరి చేసి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ధనవంతులను బెదిరించి తీసుకున్న కోట్ల విలువైన స్థిరాస్తులకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన సీజింగ్ రాజా (51) చెన్నై ఈస్ట్‌తాంబరం రామకృష్ణాపురంలో సుభాష్‌చంద్రబోస్ వీధిలో మొదటి భార్యతో నివసిస్తుండేవాడు. తాంబరం కూరగాయల మార్కెట్‌లో కూలీగా జీవితం ప్రారంభించిన రాజా ఆ తర్వాత చిల్లర నేరాలు చేస్తూ పెద్ద రౌడీలతో పరిచయాలు పెంచుకుని తాను కూడా రౌడీగా చెలామణి అవుతూ హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడేవాడు. రౌడీ సంభవ్ సెంథిల్ అండతో చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను, భూములను కబ్జా చేసేవాడు. నకిలీ దస్తావేజులు సృష్టించి, భూములు, స్థలాల సొంత దారులను చంపుతామని బెదిరించేవాడు. ఈ పరిస్థితుల్లో సీజింగ్ రాజా ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయి సెప్టెంబర్ 23న జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. తర్వాత రాజా అక్రమాస్తులను స్తంభింపజేసేందుకు తాంబరం పోలీసు కమిషనర్ అబిన్ దినేష్‌మోదక్ ఆదేశాల మేరకు పళ్ళికరనై డీసీపీ కార్తికేయన్ నాయకత్వంలో ఆరుగురు ఏసీపీలు, 14 మంది సీఐలు, రెవెన్యూ ఉన్నతాధికారుల సహా మొత్తం 200 మంది సీజింగ్ రాజా నివాసం, ఆయన బంధువుల ఇళ్లల్లో ఒకే సమయంలో సోదా చేశారు. మంగళవారం వేకువజాము ఐదు గంటల నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు జరిగాయి. ఈస్ట్‌తాంబరం రామకృష్ణాపురం సుభాష్‌చంద్రబోస్ వీధిలోని సీజింగ్ రాజా మొదటి భార్య జానకి, రెండో భార్య ఝాన్సీ, మూడో భార్య వనిత ఇళ్లు, కోవిలంబాక్కంలో హోటల్ నడుపుతున్న అతడి ప్రియురాలి నివాసంలో రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు తనిఖీలు చేశారు. ఇదే విధంగా వేలయూరు, మప్పేడు, కస్పాపురం, మాడంబాక్కం, విల్లివాక్కం ప్రాంతాల్లోని సీజింగ్ రాజా దగ్గరి బంధువుల నివాసాలు సహా మొత్తం 14 ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. రాజా మొదటి భార్య జానకి ఇంటిలో అక్రమాస్తులకు సంబంధించి కీలకమైన దస్తావేజులు, భూముల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విల్లివాక్కం తదితర ప్రాంతాల్లో నూ రాజా అక్రమాస్తులకు సంబంధించి పత్రా లు కూడా లభించాయని అధికారులు తెలిపారు.



ఈస్ట్‌తాంబరంలోని రాజా నివాసం - ఇన్‌సెట్‌లో రౌడీ సీజింగ్ రాజా (ఫైల్‌ఫొటో)

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

- 35 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి 35 దుంగలు, ఒక కారు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు కేఎస్‌కె లింగాధర్, టి.విష్ణువర్ధన్‌కుమార్, సిబ్బంది ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్‌పోస్టులో మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు ఒక కారులో వేగంగా రావడాన్ని గమనించి ఆపి తనిఖీ చేయగా అందులో పది దుంగలు ఉన్నాయి. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమిళనాడుకు చెందిన వారని గుర్తించారు. కారులోని దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో కడప సబ్ కంట్రోల్‌లోని ఆర్ఐ ఎం.చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం చంద్రగిరి మండలం పాతవాటివారిపల్లెకు సమీపంలో అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్ద కొంత మంది ఎర్రచందనం దుంగలను ఓ లారీలో తరలించేందుకు లోడ్ చేస్తుండగా చుట్టుముట్టడంతో స్మగ్లర్లు పారిపోయారు. అందులోని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 ఎర్రచందనం దుంగలను, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ కర్నాటకకు చెందిన వాడుగా గుర్తించారు. రెండు సంఘటనల్లో పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలను, వాహనాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐఎం సురేష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు వెనుక ఉన్న ఇతర స్మగ్లర్లను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు.



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు